సాక్షి
జనగామ
సోమవారం । 22 । మే । 2023



విత్తనశుద్ధితో చీడపీడలకు చెక్

విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా మొక్కలను ఆశించే చీడపీడల నుంచి రక్షించుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజు పేర్కొన్నారు. - 8లో



పిచ్చి కుక్క స్వైరవిహారం

మానుకోట జిల్లా మరిపెడ మండలంలో ఓ పిచ్చికుక్క గంట వ్యవధిలోనే 13 మందిని తీవ్రంగా గాయపర్చింది. - 8లో

గరిష్టం/కనిష్టం
$39^0/27^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఎండ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ధాన్యాన్ని సకాలంలో తరలించాలి

- కమిషనర్ అనిల్‌కుమార్



సాక్షి ఎఫెక్ట్..

బచ్చన్నపేట: మండలంలోని అన్ని ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నుంచి ధాన్యాన్ని సకాలంలో తరలించాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను ఆదివారం పరిశీలించి, మాట్లాడారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ధాన్యం తరలించాలని అన్నారు. తరుగు పేరుతో అన్నదాతలను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలిపారు. ఈ నెలాకరు వరకు పూర్తి ధాన్యం కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఎస్‌ఓ రోజారాణి, సంధ్యారాణి, శ్రీనివాస్, పలువురు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు కొనుగోళ్లు పూర్తి చేయాలి



లింగాలఘణపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈ నెలాఖరు వరకు కొనుగోళ్లను పూర్తి చేయాలని డీఆర్‌డీఓ రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పటేల్‌గూడెం, వడిచర్ల ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీడీ నూరుద్దీన్‌తో కలిసి సందర్శించారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైతులు ట్రాక్టర్లతో తరలించుకుంటే కొనుగోలు ఆలస్యం కాదని సూచించారు. ధాన్యం విక్రయించిన రైతులకు ఎంత మందికి డబ్బులు బ్యాంక్‌లో జమ అయ్యాయనే విషయాన్ని తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఏపీఎం శంకరయ్య, సీసీ శ్రీకాంత్‌రెడ్డి, కేంద్ర నిర్వాహకులు సంధ్య, అనిత పాల్గొన్నారు.

నేడు సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభం

జనగామ రూరల్: సోమవారం జిల్లా కేంద్రంలోని ధర్మ కంచ మినీ స్టేడియంలో సీఎం కప్ క్రీడా పోటీలు ప్రారంభించనున్నట్లు సీహెచ్ శివలింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 15 నుంచి 17 వరకు వివిధ మండల స్థాయిలో నిర్వహించిన క్రీడల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు జిల్లా స్థాయి పోటీలు 3 రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని ఉదయం 9 గంటలకు ఆధార్ కార్డుతో స్టేడియంలో రిపోర్ట్ చేయాలని సూచించారు. బాక్సింగ్, స్విమ్మింగ్, రెజ్లింగ్, హ్యాండ్ బాల్, బాస్కెట్ బాల్, వంటి క్రీడల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్యేలు ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, తాటికొండ రాజయ్య, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి హాజరు అవుతారని తెలిపారు.

నేటి గ్రీవెన్స్ రద్దు

జనగామ రూరల్: సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ శివలింగయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు నిర్వాహణ నిమిత్తం అధికారులను మండలాలకు ప్రత్యేక అధికారులుగా నియమించడంతోపాటు, సీఎం కప్ పోటీలను నేడు ప్రారంభిస్తున్నందున వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉందని విషయాన్ని ప్రజలు గమనించి కలెక్టరేట్‌కు రావొద్దని తెలిపారు.

వినోద్‌కు డాక్టరేట్



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఛాగల్లు గ్రామ వ్యాస్తవ్యుడు, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేపూరి వినోద్ చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించి నాటా అఫ్లికేటెడ్ విత్ యూఎస్‌ఈకి సంబంధించిన అంతర్జాతీయ హెచ్‌ఎస్‌సీ యూనివర్సిటీ డాక్టరేట్ అందించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎస్‌సీ బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్, బిషప్ డాక్టర్ ఆనంద్‌కుమార్, డాక్టర్ సామ్యూల్‌జాన్, డాక్టర్ ప్రేమానందం, ఎంఎస్ దయానంద్ సమక్షంలో ఇన్ సోషల్ సర్వీసెస్ డాక్టరేట్‌ను చేపూరి వినోద్‌కు అందజేశారు.

పూర్తయ్యేనా?

- నత్తనడకన సాగుతున్న 'మన ఊరు – మన బడి' పనులు
- పునఃప్రారంభానికి సమీపిస్తున్న గడువు
- జిల్లాలో 176 పాఠశాలలు ఎంపిక



నిర్మాణంలో ఉన్న జనగామ బాలికల ఉన్నత పాఠశాల భవనం

జనగామ రూరల్: ప్రభుత్వ బడులను బాగు చేసి, ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం మన ఊరు మనబడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎంపిక చేసిన బడుల్లో త్వరగా పనులు చేయాలనుకున్నప్పటికీ ప్రభుత్వ ఆదేశాలు ఆలస్యంగా అందడంతోపాటు, నిధులు లేక దశల వారీగా పనులు చేపట్టాలని నిర్ణయించారు. అయితే ఈనెల చివరినాటికి మొత్తం పాఠశాలలు పూర్తి చేయాలని ఆదేశాలు వచ్చాయి. రెండు నెలల నుంచి కార్యక్రమ అమలుపై సమీక్షలు, సమావేశాలుతోనే సరిపెడుతున్నారు. మరో 22రోజుల్లో పాఠశాలలకు వేసవి సెలవులు ముగుస్తాయి. అయితే పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నిత్యం అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశిస్తున్నప్పటికీ పనుల పురోగతి మాత్రం అంతంతే. దీనికి తోడు మరో రూ.30లక్షలకు పైగా పనులకు టెండర్లు ఖరారు కాకపోవడం గమనార్హం. ఈనేపథ్యంలో పాఠశాలల పునఃప్రారంభం నాటికి పనులు పూర్తయ్యే అవకాశాలు కనిపించడం లేదనేది పలువురి అభిప్రాయం. దీంతో వచ్చే విద్యాసంవత్సరంలో కూడా విద్యార్థులు అసౌకర్యాల నడుమ కాలం వెళ్లదీయాల్సిన దుస్థితి ఏర్పడుందా.. అనే అనుమానం కలుగకమానదు.

176 పాఠశాలలు ఎంపిక

జిల్లాలో మన ఊరు –మనబడి కార్యక్రమంలో 176 పాఠశాలలను ఎంపిక చేశారు. మొదటి విడతలో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో తరగతి గదులు, శిథిలావస్థలో ఉన్న బడులను గుర్తించి బాగు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ, ఇప్పటి వరకు సగం పనులు కూడా పూర్తి కాలేదని తెలుస్తుంది. మొత్తం 176 పాఠశాలల్లో కేవలం 80 పాఠశాలలు మాత్రమే పూర్తయ్యాయి. వీటిలో 48 పాఠశాలలు పెయింటింగ్ పనులు పూర్తి కాగా.. మిగతా 32 పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయి.

రూ.12.5 కోట్లు ఖర్చు

మన ఊరు –మన మడి కార్యక్రమం కింద జిల్లాలో 176 పాఠశాలల్లో అవసతులు కల్పించేందుకు సుమారు రూ.50కోట్ల వరకు అంచనా వేశారు. తక్షణం కలెక్టర్ ఖాతాలో రూ.కోటి89లక్షలు జమ చేశారు. ఇప్పటి వరకు రూ.12.5కోట్ల వరకు నిధులు ఖర్చు చేశారని అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికే 17 పాఠశాలలు ప్రారంభం కాగా 7 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. సమస్యలు ఉన్న పాఠశాలలను కాకుండా విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఎంపిక చేసిన విషయం తెలిసిందే. ఆయా పాఠశాలల్లో చిన్నపాటి మరమతులు చేసి రంగులు వేయనున్నారు. అయితే సమస్యలు ఉన్న పాఠశాలలను ఎంపిక చేసి పనులు చేపట్టకపోవడంపై జిల్లాలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాల్లో చేపట్టే పనులు..

ఎస్‌ఎంసీ తీర్మానంతో ప్రహరీల నిర్మాణం, మరమతులు, మరుగుదొడ్ల నిర్మాణం, కిచెన్‌షెడ్‌ల ఏర్పాటు, డైనింగ్ హాల్, వాటర్ పైప్‌లైన్ నిర్మాణం, విద్యుత్ సౌకర్యం, ఫ్యాన్లు, లైట్లు, నూతన భవనాలు వంటి పనులు చేపట్టనున్నారు. పనుల బట్టి ఆయా పాఠశాలకు రూ.8నుంచి రూ.16 లక్షల వరకు నిధులు మంజూరు కానున్నాయి.



పెయింటింగ్ పూర్తయిన వడ్లకొండ ఎంపీపీఎస్ (ఫైల్)

జిల్లాలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	508
ఎంపికైన పాఠశాలలు	176
పనులు పూర్తయినవి పాఠశాలలు	80
ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు	రూ.12.5 కోట్లు
ప్రారంభించిన పాఠశాలలు	17
ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి	7

పనుల్లో వేగం పెంచుతున్నాం



కలెక్టర్ ఆదేశారుసారం మన ఊరు –మన బడి పనుల్లో వేగం పెంచాం. మండలాలు, నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులు చేపడుతున్నాం. పాఠశాలలు ప్రారంభమయ్యేనాటికి మరికొన్ని పాఠశాలలు సిద్ధం చేస్తాం. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేస్తాం.

- రాము, డీఈజీ

నివేదికపై నాన్చుడెందుకు?

పాలక మండలిలో పెట్టకపోవడంలో ఆంతర్యమేంటి!

- వీసీ తాటికొండ రమేశ్ తీరుపై విమర్శలు
- అక్రమ కట్టడాల కూల్చివేత ఏది?
- భూ కబ్జాదారులపై చర్యలేవి?



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీకి చెందిన భూముల లెక్కపై అయోమయం నెలకొంది. చాలామేరకు ఆక్రమణకు గురైనట్లు ఆరోపణలు రావడంతోవిచారణ కమిటీ వేయడం.. కమిటీ క్షేత్ర స్థాయిలో పరిశీలించి 666 ఎకరాల నాలుగు గుంటల భూమి ఉన్నట్లు తేల్చింది. గతేడాది నవంబర్ 29న వీసీ తాటికొండ రమేశ్‌కు ల్యాండ్స్ కమిటీ ఒక నివేదికతోపాటు 486 పేజీల ల్యాండ్ డాక్యుమెంట్లను అందించింది. వీటిని కేయూ పాలకమండలి సమావేశంలో పెట్టి చర్చించి ఆమోదిస్తే ఓపెన్ డాక్యుమెంట్‌గా అందుబాటులోకి తేవాలని ఆకమిటీ వీసీని అప్పట్లో కోరింది.

అన్యాక్రాంతం నేపథ్యంలో కమిటీ..

1976లో పీజీ సెంటర్‌గా ఏర్పడిన యూనివర్సిటీ కోసం కుమార్‌పెల్లి, పలివేల్పుల, లష్కర్‌సింగారం రైతులనుంచి అప్పటి ప్రభుత్వం భూములు సేకరించి పరిహారం చెల్లించింది. అనంతరం ఎస్సారెస్పీ కాలువకు, పలు డిపార్ట్‌మెంట్లకు కేయూ భూములు కేటాయించింది. ఈ క్రమంలో ఇచ్చిన దానికంటే అదనంగా ఆక్రమించుకున్నారని, అక్రమార్కులు కొందరు అయితే ఏకంగా ఇళ్లు కూడా నిర్మించుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీంతో అసలు భూముల లెక్క తేల్చేందుకు రెండున్నరేళ్ల క్రితం ప్రత్యేక కమిటీని వేశారు. సీఆర్‌పీఎఫ్, పోలీస్‌స్టేషన్ క్వార్టర్లకు రెండెకరాలు ఇస్తే మరికొన్ని ఎకరాలను అదనంగా కొన్నేళ్లుగా వినియోగించుకుంటున్నట్లు ల్యాండ్స్ కమిటీ నివేదికలో తేలింది. కేయూ భూమిలో ఓ ఫంక్షన్ హాల్ కూడా నిర్మించినట్లు నివేదిక ద్వారా తెలిసింది. యూనివర్సిటీ భూములకు సంబంధించి పలు సర్వే నంబర్ల డాక్యుమెంట్లు మాయమయ్యాయని ల్యాండ్స్ కమిటీ గుర్తించింది. కాగా.. యూనివర్సిటీ భూముల్లో అక్రమంగా ఇళ్లు నిర్మించుకున్న వారికి కొంతకాలం క్రితమే వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందుకున్న వారిలో కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ కూడా ఉన్నారు. ఈవిషయం కూడా ల్యాండ్ కమిటీ నివేదికలో పేర్కొంది.

సర్వత్రా విమర్శలు

కేయూ ల్యాండ్స్ కమిటీ నివేదికను వీసీ ఆచార్య రమేశ్‌కు సమర్పించి ఈనెల 29తో ఆర్నెళ్లు పూర్తవుతాయి. ఈ ఆర్నెళ్ల వ్యవధిలో పాలక మండలి సమావేశాలు జరిగాయి. కానీ వీసీ, రిజిస్ట్రార్ మాత్రం ల్యాండ్స్ కమిటీ రిపోర్టుపై చర్చించి ఆమోదించేందుకు ఎజెండాలో పెట్టలేదు. దీంతో ల్యాండ్స్ కమిటీ చైర్మన్ డాక్టర్ నాగేంద్రబాబు విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి వాకాటి కరుణ,ఉన్నత విద్యా కమిషనర్ నవీన్‌మిట్టల్ దృష్టికి తీసుకెళ్లారు. డిజిటల్ సర్వేలో ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఇల్లు యూనివర్సిటీ భూమిలో ఉందని, ఇంకా పలువురు ఇళ్లు ఉన్నాయని వెల్లడయ్యాక కూడా వారిపై వీసీ ఎలాంటి చర్యలు చేపట్టడంలేదని యూనివర్సిటీలో చర్చ జరుగుతోంది. భూముల్ని పరరక్షిస్తానని వీసీగా రమేశ్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి చెబుతున్నారే తప్ప ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు.

రికార్డుల ప్రకారం కేయూ భూముల కేటాయింపులు ఇలా (ఎకరాల్లో)

ఎస్సారెస్పీ కాల్వ	45.10
రుద్రమాంబ ఫిల్టర్‌బెడ్ కార్పొరేషన్	13.14
ఏరియా అండ్ వాటర్ మెయిన్ పైప్‌లైన్	2.10
సీఆర్‌పీఎఫ్, పోలీస్టేషన్ క్వార్టర్లు	02
ఆలిండియా రేడియో హౌస్	3.10
విద్యుత్ సబ్‌స్టేషన్	1.01
సెరీకల్చర్ డిపార్టుమెంటు (లీజు పద్ధతిలో)	5

పైరవీలు..

ల్యాండ్స్ కమిటీ నివేదిక ద్వారా తమ భూ ఆక్రమణలు బయటకు వస్తాయని భావించి ఆక్రమణదారులు పైరవీలు మొదలుపెట్టినట్లు సమాచారం. యూనివర్సిటీ భూముల సర్వే నంబర్ల ప్రకారం ధరణి పోర్టల్‌లో ఎక్కించుకోవాల్సిన అవసరం ఉందని కమిటీ సూచించినట్లు తెలిసింది. ల్యాండ్స్ కమిటీ నివేదికపై పాలక మండలి సమావేశంలో చర్చించి ఆమోదిస్తే వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అంతా భావిస్తున్నారు.

సింగిల్ మస్టర్ స్కేల్‌తో ఉద్యోగులకు ప్రయోజనం

- రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: సింగిల్ మస్టర్ స్కేల్‌తో విద్యుత్ ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుందని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ –327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ అన్నారు. ఆదివారం హనుమకొండలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో విద్యుత్ సంస్థల్లో రెండు రకాల పే స్కేల్‌లు ఉండేవని, ఈ పీఆర్‌సీ సందర్భంగా యాజమాన్యాలపై వత్తిడి తెచ్చి సింగిల్ మస్టర్ పే స్కేల్ సాధించామని, అలాగే ఆర్టిజన్‌లకు కూడా పే స్కేలు సాధించినట్లు చెప్పారు. వైద్య సదుపాయం రూ.10 లక్షల వరకు పొందవచ్చని, ఆస్పత్రిలో చికిత్స పొందితే రూ.32 లక్షల వరకు సంస్థ ద్వారా మెడికల్ కార్డు పొందవచ్చన్నారు. అనంతరం రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ప్రభాకర్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం ఐలేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పి.రాజిరెడ్డి, జి.అశోక్‌వర్ధన్‌రెడ్డి, పి.అరుణ, చీఫ్ వైస్ ప్రెసిడెంట్‌లు పి.రమేష్, సి.హెచ్.నరేందర్ రెడ్డి, డి.గోవిందరావు, కె.వెంకటేశ్వర్‌రావు, వైస్ ప్రెసిడెంట్‌లు కె.బాబు, ఎ.రవికుమార్, బి.జస్వంత్ కుమార్, తులసి శ్రీమతి, ఎం.సత్యనారాయణరెడ్డి, పెంటయ్య చారి, పి.మధుసూదన్‌రెడ్డి, మీడియా సెక్రటరీ కె.శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి కె.భూపాల్ రెడ్డి పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో టాస్క్‌ఫోర్స్ దాడులు

- రైతుల ఫిర్యాదుతో వరుస తనిఖీలు
- మిల్లు యజమాన్యంపై కేసు నమోదు



రైస్ మిల్లును పరిశీలిస్తున్న అధికారులు



రైతుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న టాస్క్‌ఫోర్స్ సీఐ రాంబాబు

జనగామ రూరల్: ధాన్యం కొనుగోళ్లలో తరుగుపేరిట కోత దృష్ట్యా అధికారులు జిల్లా వ్యాప్తంగా రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నారు. వరంగల్ సీపీ రంగనాథ్, కలెక్టర్ శివలింగయ్య రెండు రోజుల పాటు రైస్ మిల్లుల్లో తనిఖీలు చేపట్టగా ఆదివారం జనగామ మండలంలోని చీటకోడూర్ సోమేశ్వరా ఇండస్ట్రీస్ రైస్ మిల్లులో టాస్క్ ఫోర్స్ సీఐ అల్లం రాంబాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రైతుల ఫిర్యాదుతో విచారించిన పోలీసులు మిల్లు యజమానిపై కేసు నమోదు చేశారు. ధాన్యాన్ని ఐకేపీ సెంటర్ నుంచి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు తరగు తీసి మిల్లుకు పంపగా నాణ్యత పేరుతో సోమేశ్వరా రైస్ మిల్లు అదనంగా మరో 5 కిలోలు కోత విధిస్తున్నట్లు ఖచ్చితమైన సమాచారం మేరకు విచారణ చేపట్టారు. పాలకుర్తికి చెందిన కొలు రైతు బెల్లి దిలీప్ 156 బస్తాల ధాన్యం చాకలి ఐలమ్మ ఐకేపీ సెంటర్‌కు తీసుకురాగా నిబంధనల ప్రకారం తరుగు పోను 62.4 క్వింటాళ్లు స్టాఫ్ అసిస్టెంట్ ట్రక్ షీట్‌లో వేసి మిల్లుకు పంపిచారు. మిల్లు యజమాని మాశెట్టి సంతోష్ ట్రక్ షీట్‌పై సంతకం చేసి రైతులను వెళ్లమన్నారు. నింబంధనల ప్రకారం ట్రక్ షీట్‌ను రైతుకు ఇవ్వకూడదు. మిల్లు వారు తీసుకొని బస్తాకు 2కేజీల చొప్పుల తరుగు తగ్గించి 156 బస్తాలకు 3 క్వింటాళ్ల 12 కిలోలు తరుగు తీశారు. తగ్గించిన దానిని కవర్ చేసుకోవడానికి ఫేక్ ట్రక్ షీట్ తయారు చేసి, దానిలో 156 బస్తాలకు బదులుగా 149 వచ్చినట్టు క్రియేట్ చేసి మిల్లు వారు రైతులను మోసం చేస్తున్నారు. దీంతోపాటు ట్రాకర్ తూకం కూడా ఉన్నదానింటే బిల్లులో ఎక్కువ చూపించారు. ఖాళీ ట్రాక్టర్ బరువు 36.20 క్వింటాలు ఉండగా తరుగు పేరుతో తీసిన 7 బస్తాల బరువును కలిసి 39.80 క్వింటాళ్లుగా చూపించి మొత్తంగా 2 క్వింటాళ్ల 80 కిలోలు, అలాగే 3 క్వింటాళ్ల 60 కేజీలు మోస పూరింతంగా తగ్గించి చూపించారు. ఇలా మోసం జరుగుతుందని తెలిపిన సమాచారంతో అధికారులు తనిఖీలు చేపట్టారు. అనంతరం జనగామ పోలీసులకు చర్యల నిమిత్తం అప్పజెప్పగా కేసును నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌ఓ రోజారాణి, డీఎం సంధ్యారాణి పాల్గొన్నారు.

ఇన్ని రోజులుగా ఇదేనా !

రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు సెంటర్లకు తీసుకొస్తే తరుగు పేరుతో నిలువు దోపిడీ చేస్తున్నారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లోనూ ఇదే తంతు జరుగుతుందని రైతులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా జరుగుతున్నా.. జిల్లా సివిల్ సప్లయిస్ అధికారులు తెలిసీతెలియనట్లుగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.. జిల్లాలో అసలు మిల్లులపై పర్యవేక్షణ ఉందా.. లేదా..? ఉంటే వారి కనుసన్నుల్లో జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దోపిడీ మిల్లర్లను పసిగట్టిన సాక్షి ఆకోణంలో ముందుగానే కథనాలను ప్రచురించింది.

తాటిముంజలకు ఫుల్ గిరాకీ

- పోషకాలు ఉండడంతో ఆసక్తి చూపుతున్న జనం



జనగామ: రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు మండిపోతుండడంతో తాటి ముంజలకు డిమాండ్ పెరిగింది. డజను ముంజలకు రూ.60కి పైగానే ధర పలుకుతుంది. ఆరోగ్యకరమైన పోషకాలు కలిగి ఉన్న ముంజలంటే ప్రతి ఒక్కరికీ ఇష్టమే. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ, మోత్కూరు తదితర ప్రాంతాల నుంచి ముంజలను ఎగుమతి చేసుకుంటూ.. ఇక్కడ విక్రయిస్తున్నారు. అండర్ రైల్వే బ్రిడ్జి, నెహ్రూపార్కు తదితర ఏరియాల్లో తాటిముంజలను విక్రయిస్తున్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా డజన్ లెక్కన అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలో ప్రతి రోజు రూ.20వేల నుంచి రూ.30వేల వరకు వ్యాపారం జరుగుతుండడం గమనార్హం. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతల నుంచి తాటి ముంజలతో ప్రజలు ఉపశమనం పొందుతున్నారు. తాటి ముంజల్లో విలువైన పోషకాలు ఉన్నాయి. వేసవిలో డీ హైడ్రేషన్‌కు గురికాకుండా శరీరానికి అవసరమైన నీటి శాతాన్ని అందించడంతో పాటు సీజనల్ వ్యాధుల బారి నుంచి ముంజలు కాపాడుతాయి. తాటిముంజల్లో కాల్షియం, మెగ్నీషియం, సోడియం, పొటాషియం, ఇనుము, సల్ఫర్, కాపర్‌తో పాటు మన శరీరంలోని నీటి సమతుల్యాన్ని లెవల్‌గా ఉంచుతుంది. రక్తహీనతను తగ్గించడంతో పాటు మలబద్ధకాన్ని దూరం చేస్తుంది.

అభినందనలు..



ప్రసాద్‌ను అభినందిస్తున్న కాలనీ వాసులు

స్టేషన్‌ఘన్‌పూర్: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్‌గా, ఫార్మసీ కళాశాల అధిపతిగా బాధ్యతలు చేపట్టిన ఘన్‌పూర్ ఎస్సీ కాలనీకి చెందిన ప్రొఫెసర్ నీరటి ప్రసాద్‌ను స్థానిక ఎస్సీ కాలనీ వాసులు ఆదివారం అభినందించారు. ఈ మేరకు యూనివర్సిటీలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని, తన గ్రామ ప్రజలకు విద్యాపరంగా సహకరిస్తానన్నారు. సీహెచ్.జోసెఫ్, సీహెచ్.దేవదాసు, ప్రసాద్, సింగపురం రవి, మధు, వెంకటయ్య, జ్యోతికుమార్, బాబు, దేవయ్య, రాజు, రాజ్‌కుమార్, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

'మహిళా సమ్మాన్'ను వినియోగించుకోవాలి

జనగామ: కేంద్రం పోస్టాఫీస్‌లో నూతనంగా ప్రవేశ పెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్ ఖాతాను వినియోగించుకోవాలని అసిస్టెంట్ సూపరింటెండెంట్ మూల రమాదేవి పేర్కొన్నారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ ప్రతి మహిళ ఈ ఖాతాలో రూ.1,000 నుంచి రూ.2 లక్షల వరకు రెండేళ్ల కాలానికి ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసుకోవచ్చన్నారు. దీనిపై 7.5శాతం వడ్డీ పొందవచ్చని సూచించారు. మహిళలు వయస్సుతో నిమిత్తం లేకుండా ఈ స్కీంను తీసుకోవాలని చెప్పారు.

ఎస్సైని సస్పెండ్ చేయాలని నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

జనగామ: ప్రభుత్వ భూమిని పేదలకు పంపిణీ చేయాలని పోరాటం చేస్తున్న సీపీఎం నాయకులపై అక్రమంగా బైండోవర్ కేసు నమోదు చేసిన బచ్చన్నపేట ఎస్సై నవీన్ కుమార్‌ను సస్పెండ్ చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మొకు కనకారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని నెహ్రూపార్కు వద్ద పార్టీ పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికార పార్టీకి చెందిన అంజయ్య ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే ఎస్సై నాయకుడికి రక్షణగా ఉంటున్నాడని ఆరోపించారు. పేదల పక్షాన నిలబడ్డ సీపీఎం నాయకులను టార్గెట్ చేసిన ఎస్సైపై చర్య తీసుకోని పక్షంలో ఉద్యమాలను ఉదృతం చేస్తామన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి, సుంచు విజేందర్, అజారుద్దీన్, యాకయ్య, వెంకట మల్లయ్య, నాగరాజు, ముస్నీర్ ఉన్నారు.

దోమలమందు పిచికారీ చేసిన మహిళా సర్పంచ్



మందు స్ప్రే చేస్తున్న సర్పంచ్ స్వరూపరాణి

లింగాలఘణపురం: పురుషులతో సమానంగా హక్కులకోసం పోరాడటం, అధికారం దక్కించుకోవడమే కాదు.. వారికి దీటుగా పనిలోనూ వెనుకాడేదిలేదని నిరూపించారు. ఓ మహిళా సర్పంచ్. మండలంలోని నెల్లుట్ల సర్పంచ్ చిట్ల స్వరూపరాణి ప్రజా ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. ఈక్రమంలో ఆదివారం దోమల నివారణ మందును స్వయంగా తానే స్ప్రే చేశారు. ప్రత్యేక పారిశుద్ధ్య వారోత్సవంలో భాగంగా ఆదివారం పారిశుద్ధ్య సిబ్బంది డ్రెయినేజీ వెంట బ్లీచింగ్ చల్లగా సర్పంచ్ దోమల మందు పిచికారీ చేశారు. గ్రామంలోని బక్కచింతల్ బస్తీ నుంచి అంబేద్కర్ విగ్రహం మీదుగా రంగు యాదగిరి ఇంటి వరకు స్ప్రే చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసురెడ్డి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దాం



అవగాహన కల్పిస్తున్న శేఖర్, తదితరులు

జనగామ: పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌ను నిర్మూలిద్దామని వివేకానంద సేవా సమితి జిల్లా కార్యదర్శి దొంతుల శేఖర్ అన్నారు. ఆదివారం సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ధర్మకంచ వార్డులో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ మట్టిలో కలిసి పోవడానికి 300 సంవత్సరాలు పడుతుందన్నారు. ప్రకృతి పరంగా అనేక దుష్పరిణామాలకు దారితీస్తుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు సాధ్యమైనంత వరకు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జూట్ బ్యాగులను వాడాలన్నారు. సత్యనారాయణ. మాసరాజు దుర్గేష్, విజయ్, చిదంబరం, అశోక్, పాండు తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో చీడపీడలకు చెక్

- కీటకాల నుంచి మొక్కలకు రక్షణ
- వేరుకుళ్లు తెగులు వ్యాప్తికి బ్రేక్
- కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాజు




విత్తనాలను పొడిమందుతో శుద్ధి చేస్తున్న రైతు



విత్తనాలను శుద్ధి చేస్తూ..

కరీమాబాద్: విత్తనాలను శుద్ధి చేయడం ద్వారా మొక్కలను ఆశించే చీడ పీడల నుంచి రక్షించుకోవచ్చు. విత్తనాల ద్వారా వ్యాపించే వివిధ రకాల వ్యాధులను, వ్యాధికారక కీటకాల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. ముఖ్యంగా మొలకెత్తే విత్తనాలు, లేత మొలకలలో నేల ద్వారా వ్యాపించే తెగుళ్ల వ్యాప్తిని నియంత్రించవచ్చు. విత్తనాలలో అంకురోత్పత్తి మెరుగు పడుతుంది. ఆరు నెలల వరకు వ్యాపించే వేరుకుళ్ల నుంచి మొక్కలకు రక్షణ కల్పిస్తుంది. పంట మొదటి దశలో రసం పీల్చే పురుగులు, వేరు పురుగుల నుంచి రక్షణ ఉంటుంది. తొలి దశలో రసాయన పురుగు మందుల పిచికారీకి అయ్యే ఖర్చు తగ్గుతుంది. ఖరీఫ్ సీజన్ పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో విత్తన శుద్ధితో కలిగే ప్రయోజనాలను కేవీకే శాస్త్రవేత్త వివరించారు. మూడు రకాలుగా విత్తన శుద్ధి ఉంటుందని పేర్కొన్నారు.

సీడ్ డ్రెస్సింగ్..



ఇది విత్తన శుద్ధికి సంబంధించి సాధారణ పద్ధతి. ఇందులో రసాయన మందు పొడిని ద్రవంగా మార్చి తడిగా ఉన్నప్పుడు విత్తనానికి పట్టించాలి. తక్కువ ఖర్చుతో కూడిన మట్టి కుండలు, పాలిథిన్‌షీట్లలో విత్తనాలకు కలపవచ్చు. రైతులు ఇంటి వద్ద వీలు కాకుంటే పొలం దగ్గర కూడా విత్తన శుద్ధి చేసుకోవచ్చు.

విత్తన పూత..

విత్తనానికి రసాయన పురుగుమందులు అంటి ఉండడానికి ఒక ప్రత్యేక బైండర్‌ని పురుగుమందుతో కలిపి ఉపయోగించాలి. ఈ పద్ధతిని ఎక్కువగా విత్తన పరిశ్రమల్లో ఉపయోగిస్తారు.

విత్తన పెల్లెటింగ్..

ఇది అత్యంత అధునాతనమైన విత్తన శుద్ధి పద్ధతి. దీంతో విత్తనం భౌతిక ఆకృతి మారుతుంది. పెల్లెటింగ్‌కు ప్రత్యేకమైన మిషనరీ, టెక్నిక్‌లు అవసరముంటాయి. ఖరీదైన విత్తన శుద్ధి పద్ధతి కాబట్టి కంపెనీల్లో ఉపయోగిస్తారు.

విత్తనశుద్ధితో పంటలకు మేలు



రైతులు విత్తనాలను శుద్ధి చేసుకోవడం ద్వారా ఎంతో మేలు జరుగుతుంది. మొక్క దశలో వివిధ రకాల మందులు పిచికారీ చేయడానికి అయ్యే ఖర్చు తగ్గుతుంది. అంతేకాకుండా విత్తనం మొలకెత్తే సమయంలోనూ చీడ పీడలు గింజలను ఆశించకుండా కాపాడుతుంది. తెగుళ్ల, ముడతలు రాకుండా మొక్కలను రక్షించుకోవచ్చు. మోతాదు ప్రకారం మందులు కలిపి విత్తనాలను శుద్ధి చేసుకోవాలి.

– డాక్టర్ రాజు, శాస్త్రవేత్త, కేవీకే మామునూరు

పంటలు-విత్తన శుద్ధి-రసాయనాల వాడకం

చెరుకు : విత్తన శుద్ధి ద్వారా వేరు తెగులు, ఎండు తెగులు వ్యాప్తిని తగ్గిస్తుంది. చెరుకు గడలకు కార్బండిజం, ట్రైకోడెర్మా లాంటి మందులు వాడుకోవాలి.

వరి : పంటలో వేరుకుళ్ల వ్యాధిని తగ్గించడానికి విత్తనాలకు ట్రైకోడెర్మా, క్లోరోపైరిఫాస్, సూడోమోనాస్, ఫ్లోరోసెన్స్ వాడాలి. పురుగులను తగ్గించడానికి మోనోక్రోటోఫాస్ ద్రావణంలో విత్తనాలను ఆరు గంటలు నానబెట్టాలి.

మిరప : మిరప విత్తనాలకు ఆంత్రాక్నోస్, డంపింగ్ ఆఫ్ ద్వారా వచ్చే వ్యాధిని తగ్గించడానికి ట్రైకోడెర్మా విరిడి, కార్బండిజం మందును కలిపి విత్తనశుద్ధి చేయాలి. నేల ద్వారా సంక్రమించే శిలీంధ్ర వ్యాధులను తగ్గించడానికి ట్రైకోడెర్మా విరిడితోపాటు సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ విత్తనాలకు కలిపి శుద్ధి చేయాలి. రసం పీల్చే పురుగులు, పచ్చ పురుగులు, తామర పురుగులు, పేను బంక వ్యాప్తిని తగ్గించడానికి ఇమిడాక్లోప్రైడ్ విత్తనాలకు కలపాలి.

బెండ : బెండలో రసం పీల్చే పురుగులను తగ్గించడానికి ఇమిడాక్లోప్రైడ్, నులి పురుగులను తట్టుకోవడానికి పెసిలోమైసెస్ లిలాసినస్, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ విత్తనాలకు కలిపి శుద్ధి చేయాలి.

టమాట..: శిలీంధ్ర వ్యాధి, ఆకు ముడత, కాండం కుళ్లు, ఎండు తెగులు తట్టుకోవడానికి ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్, వర్టిసిల్లియమ్ క్లామిడోస్పోరియం విత్తనానికి కలపాలి.

బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి..

రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ములు దుర్మరణం

- ఒకరికి గాయాలు..
- అనాథలైన తల్లిదండ్రులు



అభిషేక్ (ఫైల్)



ఆశిష్ (ఫైల్)

టేకుమట్ల: బంధువుల ఇంట్లో శుభకార్యానికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో అన్నాదమ్ముళ్లు మృతి చెందగా, ఒకరు తీవ్రంగా గాయపడిన సంఘటన మండలంలోని గర్మిళ్లపల్లిలో ఆదివారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా కేంద్రంలోని గోపాలస్వామిగుడి ప్రాంతానికి చెందిన ఎంజీఎం ఉద్యోగి జన్ను ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని గర్మిళ్లపల్లికి చెందిన సమీప బంధువు దాసారపు కొమురయ్య ఇంట్లో జరిగిన శుభకార్యానికి హాజరయ్యారు. ఆదివారం కారులో ప్రసాద్ పెద్ద కుమారుడు జన్ను ఆశిష్(17), చిన్న కుమారుడు అభిషేక్(15)లు దాసారపు జానీలు కలిసి గ్రామసమీపంలోకి బహిర్భూమికి వెళ్తుండగా డబుల్‌బెడ్రూం ఇండ్ల సమీపంలో కారు అదుపుతప్పి పల్టీలు కొట్టడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తీసుకువెళ్ల అభిషేక్ మృతి చెందినట్లు తెలిపారు. ఆశిష్‌ను మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. జానీని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు.

ఇంట్లో కమ్ముకున్న చీకటి.....

జన్ను ప్రసాద్–తిరుమలకు ఇద్దరు కుమారులే లోకంగా బతుకుతున్న వారి కుటుంబంలో కారు ప్రమాదం రూపంలో వారిద్దరినీ బలి తీసుకుంది. మొత్తం ఇంటినే చీకటి కూపంలోకి నెట్టినట్లుగా ఉంది. ఓ దేవుడా మేమేం పాపం చేశాం, మమ్మల్ని దిక్కు లేని వారిని చేసావు అంటూ, అనాథలను చేసి వెళ్లిపోయారా బిడ్డలారా అంటూ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ద్విచక్రవాహనాలు ఢీ.. ఒకరి మృతి

- ముగ్గురికి గాయాలు

వాజేడు : మండల పరిధిలోని మండపాక సమీపంలోని పుల్ల చెలిమెలు ప్రాంతంలో 163 నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం ఎదురెదురుగా వస్తున్న రెండు బైక్‌లు ఢీ కొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వెంకటాపురం(కె) మండల పరిధిలోని బర్లగూడెంకు చెందిన తల్లడి రవి(39) తన స్నేహితుడి బైక్‌పై ఏటూరునాగారం మండలం వెళ్లి అక్కడి నుంచి స్వగ్రామానికి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో వెంకటాపురం(కె) మండల పరిధిలోని పాత్రాపురం(మంగవాయి) గ్రామానికి చెందిన ముగ్గురు బైక్‌పై ఏటూరునాగారం వెళ్తున్నారు. వాజేడు మండలం మండపాక సమీపంలోని పుల్ల చెలిమెలు ప్రాంతానికి రాగానే రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో తల్లడి రవి తలకు బలమైన గాయమైంది. వెంటనే ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం ములుగు తరలించాలని తెలుపడంతో ఆస్పత్రి నుంచి వాహనంలోకి మారుస్తుండగానే చనిపోయాడు. వేరే వాహనంపై వచ్చిన ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. మృతుడికి భార్య ప్రమీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రవి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు.



ఉపేందర్ మృతదేహం

బైక్ అదుపు తప్పి ఒకరు..

మరిపెడ రూరల్: బైక్ అదుపు తప్పి మీద పడడంతో ఊపిరాడక ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన మండలంలోని గాలివారిగూడెం శివారులో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం...గాలివారిగూడెంకు చెందిన ఆలుదాసు ఉపేందర్ (44) తాపీమేస్త్రీగా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే తన బైక్ (టీవీఎస్ ఎక్సెల్)పై స్వగ్రామం నుంచి మరిపెడ బంగ్లాకు పనుల నిమిత్తం వెళ్తున్నాడు. ఈ క్రమంలో గ్రామ శివారు ధారావత్ వెంకన్న పొలం వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన కిందపడ్డాడు. బండి అతని ముఖంపై పడడంతో ఊపిరాడక చనిపోయాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

రెండు తలల పాము పట్టివేత



పామును అటవీ శాఖ సిబ్బందికి అప్పగిస్తున్న దృశ్యం

వాజేడు : ఆదివారం రెడ్ శాండ్ బోవా అనే రెండు తలలపాము (శిఖండి) దొరకడంతో పట్టుకున్న వ్యక్తులు అటవీ శాఖ సిబ్బందికి అప్పగించారు. మండల పరిధిలోని ప్రగల్లపల్లి శివారులో ఆదివారం శిఖండి రోడ్డు దాటుతుండగా గుర్తించిన వెంకటాపురం(కె)కు చెందిన భార్గవ్, సర్వేశ్వర్‌రావు పట్టుకున్నారు. వెంకటాపురం(కె) లోని రేంజ్ కార్యాలయానికి వెళ్లి వాజేడు, వెంకటాపురం(కె), దూలాపురం రేంజ్ కార్యాలయాల సిబ్బందికి అప్పగించారు. సమీప అడవిలో వాజేడు, వెంకటాపురం(కె) సిబ్బంది సహకారంతో వదిలేసినట్లు వాజేడు రేంజర్ చంద్రమౌళి తెలిపారు.

'నకిలీ'పై నజర్

- అక్రమాలకు పాల్పడితే చర్యలు
- విత్తన టాస్క్‌ఫోర్స్ ఏడీఏ శ్రీదేవి



శ్రీరామ విత్తన ప్లాంట్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీదేవి

నెక్కొండ: ఖరీఫ్ ప్రారంభం కాకముందే పలు చోట్ల ఇటు వ్యవసాయ శాఖ, అటు పోలీస్‌శాఖ విత్తన నిల్వలు గల షాపులను, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడం ప్రారంభించారు. అయితే గతంలో జిల్లాలో అక్కడక్కడ నకిలీ విత్తనాలు విక్రయానికి పాల్పడడంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ టాస్క్‌ఫోర్స్ బృందం (కమిషనర్ కార్యాలయం విత్తన టాస్క్‌ఫోర్స్ అధికారులు) రంగంలోకి దిగారు. మండల కేంద్రంలోని విజయలక్ష్మి, శ్రీభాగ్యలక్ష్మి ఫెర్టిలైజర్స్, సాయి శ్రీనివాస్ సీడ్స్, విజయ ఏజెన్సీస్ దుకాణాల్లో ఆదివారం దాడులు జరిపి, విస్తృత తనిఖీలు చేపట్టారు. తనిఖీలో భాగంగా నిల్వ ఉంచిన విత్తన ప్యాకెట్లు, వాటి ధ్రువీకరణ ఆధారపత్రాలు, స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్కులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ శాఖ విత్తన ఏడీఏ వి.శ్రీదేవి మాట్లాడుతూ ఏటా సీజన్ ముందు ప్రతీ విత్తన షాపులను తనిఖీ చేస్తామన్నారు. అనుమతులు లేని షాపుల్లో విత్తనాలను రైతులు కొనుగోలు చేయ్యవద్దని సూచించారు. అలాగే గ్రామాల్లో అనుమతులు లేకుండా విత్తనాలు అమ్మే వారి వివరాలను వ్యవసాయ అధికారుల దృష్టికి తీసుకురావాలనిపేర్కొన్నారు. అలాగే బిటా–3 పత్తి విత్తనాలు విక్రయించవద్దన్నారు. విత్తన డీలర్లు అనుమతి లేని గోదాంలలో విత్తన నిల్వలు ఉంచవద్దని, విధిగా స్టాక్ రిజిస్టర్లు, బిల్ బుక్‌లను నిర్వహించాలని ఆమె సూచించారు. దాడుల్లో ఆ శాఖ విత్తన ధ్రువీకరణ అధికారి కె. విజయ్‌కుమార్, నర్సంపేట ఏడీఏ జె. అవినాష్‌వర్మ, నెక్కొండ ఏఓ ఎగిడి నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట రూరల్ : ఖరీఫ్ సీజన్‌లో రైతులు కొనుగోలు చేసే విత్తనాల ప్యాకెట్‌ల వివరాలను డీలర్లు, షాపు యాజమానులు తప్పనిసరిగా బిల్లులో నమోదు చేయాలని కమిషనర్ ఆఫీసర్ ఏడీఏ శ్రీదేవి, సీడ్ సర్టిఫికేషన్ ఆఫీసర్ వినయ్‌కుమార్ అన్నారు. మండలంలోని ముగ్ధుంపురంలో శ్రీరామవిత్తనోత్పత్తి సంఘం ప్రాసెసింగ్ ప్లాంట్ ఆదివారం కమిషన్ ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయి సీడ్స్ ట్రాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేపట్టింది. అనంతరం పట్టణం, మండలంలోని విత్తనషాపులను తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్ వివరాలను, గోదాములను పరిశీలించారు. వారి వెంట నర్సంపేట ఇన్‌చార్జ్ వ్యవసాయ సహాయ సంచాలకులు అవినాష్ వర్మ, ఏఓ క్రిష్ణకుమార్ ఉన్నారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- గంట వ్యవధిలో 13 మందిపై దాడి
- రెండు గ్రామ పంచాయతీల్లో ఘటనలు



గాయపడిన చిన్నారి శ్వేత, గుగులోతు బుల్లి, కార్తీక్, బానోతు హోలీ

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం వెంకట్‌తండా, స్టేజీతండా జీపీల్లో ఆదివారం ఓ పిచ్చికుక్క స్వైరావిహారం చేసి గంట వ్యవధిలోనే 13 మందిని తీవ్రంగా గాయపర్చింది. స్థానికుల కథనం ప్రకారం.. మొదట స్టేజితండా జీపీ పరిధి మేగ్యాతండా (బడ్డతండా)లోని వీధుల్లో పిచ్చికుక్క తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేసింది. దీంతో గుగులోతు మోహన్, బోడ కీమా, భూక్య భద్రు, భూక్య కార్తీక్, భూక్య చరణ్‌తో పాటు అక్కడే వెంచర్ వద్ద తల్లిదండ్రులతో ఉన్న 9 ఏళ్ల బాలిక తీవ్రంగా గాయపర్చింది. ఈ క్రమంలో తండావాసులు పిచ్చి కుక్కను వెంబడించగా.. పక్కనే ఉన్న వెంకట్‌తండా జీపీలోకి చొరబడింది. అక్కడ కూడా తారసడ్డ గుగులోతు రాంలాల్, గుగులోతు విజయ, గుగులోతు బుల్లి, గుగులోతు ఈక్య, బానోతు హోలీ, బాలుడు సాయితేజ, మరో బాలిడిపై దాడి చేసింది. గంట వ్యవధిలోనే మొత్తం 13 మందిని పిచ్చి కుక్క గాయపర్చింది. అనంతరం తండా ప్రజలంతా కలిసి ఆ కుక్కను హతమార్చారు. వెంకట్‌తండా సర్పంచ్ గుగులోతు సూరనాయక్ స్పందించి గాయపడ్డ వారిని మరిపెడ పీహెచ్‌సీకి తరలించారు. తీవ్ర గాయాలైన వారిని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి పంపించి చికిత్స చేయిస్తున్నారు.

పెట్రోల్‌లో నీళ్లు

- ఖంగుతిన్న అధికారులు
- తాత్కాలికంగా నిలిపివేత



నీళ్లు వచ్చిన బాటిల్‌ను చూపుతున్న వినియోగదారుడు

మంగపేట: మండల కేంద్రం పరిధిలోని గంపోనిగూడెం సమీపంలో మార్కెట్ యార్డు వద్ద నూతనంగా ఏటూరునాగారం గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో పెట్రోల్‌తో పాటు నీళ్లు రావడంతో వాహనదారులు ఖంగుతిన్నారు. ఆదివారం బాధిత వినియోగదారులు తెలిపిన కథనం ప్రకారం.. పెట్రోల్ బంక్‌ను జీసీసీ అధికారులు ఈనెల 20 శనివారం ట్రయల్ రన్ చేసి ప్రారంభించారు. ఆదివారం ఉదయం మండలంలోని చెరుపల్లికి చెందిన దిడ్డి లక్ష్మీనర్సయ్య తన కారులో రూ.2,510 పెట్రోల్ పోయించుకుని కొద్దిదూరం వెళ్లగానే కారు ఆగిపోయింది. అదే సమయంలో కమలాపురంకు చెందిన ఓ యువకుడు, ఇతర వాహనదారులు పెట్రోల్ పోయించుకోగా నీళ్లు వస్తున్న విషయాన్ని గుర్తించారు. లక్ష్మీనర్సయ్య ఒక బాటిల్‌లో పెట్రోల్ పోయించి పరిశీలించగా సగం పెట్రోల్, సగం నీళ్లు వచ్చినట్లు గుర్తించి బంక్ నిర్వాహకులను నిలదీశారు. దీంతో నీళ్లు ఎలా వచ్చాయో తమకు తెలియదని ఈ విషయాన్ని తమ అధికారులకు సమాచారం ఇస్తున్నాం వారు వచ్చే వరకు వేచి ఉండాలని చెప్పడంతో కొంత సేపు వేచి చూసినా సంబంధిత అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పెట్రోల్‌లో నీరు రావడానికి పూర్తి బాధ్యత వహించాలని చెప్పి కారును బంక్‌లోనే ఉంచి వేరే కారులో వెళ్లిపోయారు. ట్రయల్ రన్ మొదలు పనెట్టిన అధికారులు భూమిలో అమర్చిన పెట్రోల్ ట్యాక్, పైప్‌లైన్ నీళ్లు ఉన్న విషయాన్ని గుర్తించకుండా ఆదివారం నుంచి విక్రయాలు ప్రారంభించడంతో సమస్య తలెత్తిందా లేక మరేమైనా జరిగి ఉంటుందా అని వినియోగదారులు అనుమానం వ్యక్తం చేశారు. బంక్ నిర్వాహకులు సంబంధిత జీసీసీ అధికారుల దృష్టికి తీసుకుపోగా తాత్కాలికంగా విక్రయాలను నిలిపివేశారు. ఈ విషయంపై జీసీసీ డీఎం ప్రతాపరెడ్డిని వివరణ అడిగేందుకు ఫోన్‌లో సంప్రదించగా తాను తర్వాత మాట్లాడుతానని మెసేజ్ పెట్టారు.

అడవి పందులను తరలిస్తున్న వాహనం పట్టివేత



వాహనాన్ని ఫారెస్టు అధికారులకు అప్పగిస్తున్న పోలీసులు

చిల్పూరు : నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న తొమ్మిది అడవి పందుల వాహనాన్ని పట్టుకుని వాటిని అటవీశాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. స్పెషల్ బ్రాంచి అధికారుల విశ్వసనీయ సమాచారం మేరకు టాటాఏస్ ట్రాలీలో అడవి పందులను అక్రమంగా తరలిస్తుండగా నష్కల్ అండర్ బ్రిడ్జి వద్ద పట్టుకుని విచారించగా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వద్ద తక్కువ ధరకు అడవి పందులను కొనుగోలు చేసి మాంసం అమ్ముకుని డబ్బులు సంపాదించేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిసిందన్నారు. అడవి పందులను అక్రమంగా తరలిస్తున్న ఐనవోలు మండలం వెంకటాపూర్‌కు చెందిన రాయపురం సురేష్‌ను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వాహనాన్ని సీజ్ చేసి అడవి పందులను ఫారెస్టు అధికారులకు అప్పగించినట్లు తెలిపారు.

వడదెబ్బతో ఆటోడ్రైవర్ మృతి



కుమారస్వామి మృతదేహం

దుగ్గొండి: వడదెబ్బ బారిన పడి ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురంలో ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. హన్మకొండ జిల్లా మడికొండ మండల కేంద్రం ఇందిరమ్మ కాలనీకి చెందిన పెరుమాండ్ల కుమారస్వామి (55) ఆటో నడుపుకుంటూ లక్ష్మీపురం వచ్చాడు. తిరుగుప్రయాణంలో ఆటో నడుపుకుంటూ వెళ్తుండగా దాహం వేయడంతో ఆటోను ఆపాడు. సమీపంలో ఓ ఇంట్లో మంచినీరు అడిగి తాగాడు. అనంతరం ఆటోలో కూర్చొని చాతిలో నొప్పి అంటూ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

మార్కెట్‌లో షెడ్ల కిందే విక్రయాలు

వరంగల్ : వేసవి ఎండల తీవ్రత పెరిగిపోతుండడంతో నేటి (సోమవారం) నుంచి మార్కెట్‌లో షెడ్ల కిందే సరుకుల క్రయవిక్రయాలు చేపట్టాలని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్ష, కార్యదర్శులు ఆదివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. గుమాస్తాల సంఘం, అడ్తిదారుల సంఘాలతో జరిగిన సంయుక్త సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయాలను ఛాంబర్ ఆఫ్ కామర్స్ అడ్తి సెక్షన్ సభ్యులందరికీ తెలియజేస్తున్నట్లు తెలిపారు. మార్కెట్ వ్యాపార లావాదేవీలు చేపట్టే గుమాస్తాలు వడదెబ్బ బారిన పడకుండా జూన్ 10 వరకు మార్కెట్‌కు సెలవులు ప్రకటించేందుకు తగు చర్యలు తీసుకోవాలని వరంగల్ గ్రెయిన్ మార్కెట్ గుమాస్తా సంఘం చాంబర్ ఆఫ్ కామర్స్‌కు ఇచ్చిన లేఖపై రెండు రోజుల క్రితం ఛాంబర్ ఆధ్వర్యంలో గుమస్తా సంఘం ప్రతినిధులు, మార్కెట్ సంబంధిత సెక్షన్ల ప్రతినిధులతో జరిగిన సంయుక్త సమావేశంలో ఇరువర్గాలు సుదీర్ఘంగా చర్చించాయి. ఎండల తీవ్రత నేపథ్యంలో 22వ తేదీ నుంచి రైతులు మార్కెట్‌కు తీసుకొచ్చే అన్ని సరుకులను మార్కెట్ యార్డులోని షెడ్ల కిందే వేయించి వ్యాపార లావాదేవీలు నిర్వహించేందుకు అన్ని వర్గాలు సహకరించాలని పేర్కొన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



సురేష్ (ఫైల్)

మహబూబాబాద్ రూరల్ : ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని రేగడితండలో ఆదివారం చోటుచేసుకుంది. కురవి ఎస్సై బి.రాము తెలిపిన వివరాల ప్రకారం...రేగడి తండకు చెందిన ఇస్లావత్ సురేష్ (27) వ్యవసాయం, కూరగాయలు సాగుచేసుకుని జీవనం సాగిస్తున్నాడు.రెండు రోజుల క్రితం సురేష్, భార్య పార్వతి కలిసి తిరుపతికి దర్శనానికి వెళ్లారు. శనివారం సాయంత్రం రేగడితండాకు రాగా భార్య భర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. దీంతో సురేష్ మనస్తాపానికి గురై ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి మాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి అనంతరం మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్

కాజీపేట రూరల్ : కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) హెడ్‌కానిస్టేబుల్ సస్పెండైన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆదివారం రాత్రి అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 17న రైల్వే డీజిల్ లోకోషెడ్ ఆర్‌పీఎఫ్ ఔట్‌పోస్టులో హెడ్‌కానిస్టేబుల్ బాలసుబ్రమణ్యం, కానిస్టేబుల్ పాశ్వాన్‌లు విధులు నిర్వహిస్తున్నారు. ఇద్దరు మధ్య వచ్చిన వాదనలపై బాలసుబ్రమణ్యం పాశ్వాన్‌పై చేయి చేసుకున్నాడు. దీంతో పాశ్వాన్ ఆర్‌పీఎఫ్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఉన్నతాధికారుల ఆదేశానుసారం బాలసుబ్రమణ్యంను సస్పెండ్ చేసి పర్లీ డివిజన్‌కు బదిలీ చేసినట్లు తెలిపారు.

ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీస్



ఎంజీఎంలో రాజుతో ట్రాఫిక్ పోలీస్ స్వామి

ఎంజీఎం: నగరంలోని ములుగు రోడ్డు జంక్షన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ పోలీస్ వావిలాల స్వామి గుండెపోటు గురైన ఓ వ్యక్తి ప్రాణాలు కాపాడి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం ములుగు రోడ్డు వద్ద హనుమకొండ అలంకార్ ప్రాంతంలోని రేషన్ డీలర్ రాజు బైక్‌పై ప్రయాణిస్తూ ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుప్పకూలాడు. గమనించిన ట్రాఫిక్ పోలీస్ స్వామి హుటాహుటిన అక్కడికి చేరుకొని రాజుకు సీపీఆర్ చేయడంతో అతనికి స్పృహ వచ్చింది. వెంటనే మెరుగైన చికిత్స కోసం ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. నిండు ప్రాణాలు కాపాడిన ట్రాఫిక్ పోలీస్ వావిలాల స్వామి పలువురు అభినందించారు.